TGTEL/25/A4812

# వాయిస్ ఆఫ్ వందే భారత్

Voice of Vande Bharath

తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 50 | పేజీలు : 04| వెల: రూ.3/-    తెలంగాణ    సోమవారం | జూన్ 01, 2026

## ఆంధ్రా ప్రజలతో పేచీ లేదు..

- అక్కడి రాజకీయ నాయకులతోనే మన పంచాయితీ
- ఇక్కడ వేలు పెట్టి, గరిటె తిప్పుతామంటే తిప్పికొడతాం
- టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత హెచ్చరిక
- తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీస్తే ఊరుకోం..
- మాది 'టీఆర్ఎస్ 2.0' అని గుర్తుంచుకోండి



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఆంధ్రా ప్రజలతో తెలంగాణ సమాజానికి ఏనాడూ ఎలాంటి పేచీ లేదని, ఉన్నదల్లా అక్కడి రాజకీయ నాయకులతోనే అని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. పొరుగు రాష్ట్ర నాయకులు ఇక్కడ వచ్చి పెత్తనం చేయాలని చూస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఆమె ఘాటుగా హెచ్చరించారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలకు తెగించి అనేక పోరాటాలు చేశామని గుర్తుచేసిన కవిత.. సోమవారం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆంధ్రా, తెలంగాణ ప్రజల మధ్య ఎలాంటి విభేదాలు లేవని, కానీ ఆంధ్రా రాజకీయ నాయకుల ఏజెంట్ ఇక్కడ ముఖ్యమంత్రిగా ఉండటం వల్లే ప్రస్తుతం ఎక్కడ పడితే అక్కడ ఆంధ్రా వాళ్ల విగ్రహాలు పెడుతున్నారని ఆమె ఆరోపించారు. ( **మిగతా వివరాలు 2వ పేజీలో..** )



## వర్షాభావ పరిస్థితులపై అవగాహన కల్పించాలి




- తక్కువ నీటి వినియోగం, పంట మార్పిడి, వైవిధ్యీకరణపై అన్నదాతలకు వివరించాలి
- దెబ్బతిన్న రోడ్లు, వంతెనల పునర్నిర్మాణానికి రూ.1,000 కోట్ల అత్యవసర నిధులు విడుదల
- వర్షాకాల సన్నద్ధతపై సెక్రటేరియట్‌లో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : రాష్ట్రంలో రాబోయే వర్షాకాల పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం మరియు వర్షాభావ సూచనల నేపథ్యంలో అన్నదాతలను ముందస్తుగా అప్రమత్తం చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వర్షాకాల సన్నద్ధత, విపత్తు నిర్వహణ, సాగునీటి ప్రాజెక్టుల రక్షణపై సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలోముఖ్యమంత్రి అధ్యక్షతన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ కీలక సమావేశానికి వ్యవసాయం, నీటి పారుదల, పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్, మున్సిపల్, ఆరోగ్య, హోం, హైడ్రా, విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వాతావరణ శాఖ అధికారులు నైరుతి రుతుపవనాల రాక, ఎల్‌నినో ప్రభావం, ఆశించిన వర్షపాతంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సీఎంకు వివరించారు. ( మిగతా వివరాలు 2వ పేజీలో.. )

## బార్‌లో యువకుల మధ్య గొడవ

- యువతి ప్రాణం తీసిన దుండగులు
- బైక్‌ను కారుతో ఢీకొట్టిన ప్రత్యర్థులు..
- శ్రీలంక శరణార్థి యువతి అక్కడికక్కడే మృతి
- ముగ్గురు నిందితుల అరెస్ట్..
- పరారీలో ఉన్న వారి కోసం పోలీసుల గాలింపు

**చెన్నై, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** చెన్నై నగరంలో ఒక ప్రైవేట్ బార్‌లో రెండు వర్గాల మధ్య జరిగిన చిన్నపాటి గొడవ చిలికి చిలికి పెద్దదై, చివరికి ఒక 18 ఏళ్ల యువతి దారుణ హత్యకు దారితీసింది. బైక్‌పై వెళ్తున్న యువతులను ప్రత్యర్థులు కారుతో వెంబడించి ఢీకొట్టడంతో ఒక యువతి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘోర వృత్తాంతానికి కారణమైన ముగ్గురు నిందితులు బాలమురుగన్ (21), జోశ్వ (19), కిషోర్ కుమార్‌లను పోలీసులు వేగంగా స్పందించి అరెస్టు చేశారు. మృతురాలిని విల్లుపురం జిల్లాలో నివసిస్తున్న శ్రీలంక శరణార్థి యాన్సీ (18)గా పోలీసులు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విల్లుపురం జిల్లాకు చెందిన యాన్సీ, ఆమె స్నేహితులతో కలిసి చెన్నై నగరంలోని ఒక ప్రైవేట్ బార్‌కి వెళ్లారు. అక్కడ డ్యాన్స్ ఫ్లోర్‌పై యాన్సీ గ్రూప్ డ్యాన్స్ చేస్తుండగా, అక్కడే ఉన్న మరో పురుషుల బృందానికి చెందిన కొందరు యువకులు వారితో వాగ్వాదానికి దిగారు. ఇరు వర్గాల మధ్య మాట మాట పెరిగి పెద్ద ఘర్షణగా మారింది. దీంతో బార్ బౌన్సర్లు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.



2లో..

## ఆన్‌లైన్ బెట్టింగ్ మాఫియా గుట్టురట్టు

- సీఐడీ చీఫ్ చారు సిన్హా నేతృత్వంలో 'భారీ ఆపరేషన్'
- 11 మంది నిర్వాహకులు అరెస్ట్
- కరీంనగర్ 'డాఫా బెట్' కేసు ఛేదించిన అధికారులు..
- 46 మ్యూల్ బ్యాంక్ ఖాతాలు సీజ్
- 8 రాష్ట్రాల్లో 225 ఫిర్యాదులు..
- రోజుకు 8 నుంచి 10 లక్షల అక్రమ సంపాదన
- బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసిన 25 మంది సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లుయెన్సర్లకు కౌన్సెలింగ్

## తెలంగాణపై విషం చిమ్ముతున్న పవన్ కళ్యాణ్..

- ఇక్కడ నవనిర్మాణ సభ ఏంటి?
- రాష్ట్ర ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పిన తర్వాతే హైదరాబాద్‌లో సభ పెట్టాలి
- బీజేపీ ప్రోద్బలంతోనే పవన్ యాక్టింగ్..
- మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర ఆగ్రహం



2లో..

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
సోమవారం, జూన్ 01, 2026

# ఆంధ్రా ప్రజలతో పేచీ లేదు..

- అక్కడి రాజకీయ నాయకులతోనే మన పంచాయితీ
- ఇక్కడ వేలు పెట్టి, గరిటె తిప్పుతామంటే తిప్పికొడతాం
- టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత హెచ్చరిక
- తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీస్తే ఊరుకోం..
- మాది 'టీఆర్ఎస్ 2.0' అని గుర్తుంచుకోండి

**(మొదటి పేజీ తర్వాత..)** తెలంగాణపై ఏది పడితే అది మాట్లాడటం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని, తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఇప్పుడు మళ్లీ ఏర్పడిందని కవిత పిలుపునిచ్చారు. "తెలంగాణలో స్థిరపడిన సెటిలర్స్ అంతా మావాళ్లే. ఎవరైనా ఇక్కడికి రావచ్చు.. పోవచ్చు.. వ్యాపారాలు చేసుకోవచ్చు.. షూటింగ్‌లు చేసుకొని వెళ్లవచ్చు. కానీ, సెక్రటేరియట్‌లో కూర్చుని ఏపీ నాయకులు గంటె తిప్పుతామంటే ఊరుకునే ప్రసక్తే లేదు. మేము 'టీఆర్ఎస్ 2.0' అనే విషయం గుర్తు పెట్టుకోవాలి. మా విధానాల్లో వేలు పెట్టి, మా అస్తిత్వాన్ని దెబ్బకొడతామంటే సహించేది లేదు. మేము కచ్చితంగా మళ్లీ అధికారంలోకి వస్తాం.. ఇక్కడ పెడుతున్న ఆంధ్రా నాయకుల విగ్రహాలను కూల్చేస్తాం" అని కవిత తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. మంగళవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తెలంగాణలో పర్యటించనుండటం, 'తెలంగాణ నవ నిర్మాణ సభ' పేరుతో జనసేన నేతలతో సమావేశం కానుండటంపై రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఈ నేపథ్యంలో పవన్ కళ్యాణ్‌ను ఉద్దేశించి కవిత అత్యంత ఘాటైన వ్యాఖ్యలు చేశారు. "పవన్ కళ్యాణ్ గారూ.. ముందు మీ ఏపీ సెక్రటేరియట్‌లోకి వర్షం నీళ్లు రాకుండా చూసుకోండి.. ఆ తర్వాత ఇక్కడికి వచ్చి తెలంగాణ నవ నిర్మాణ సభలు పెట్టుకోండి. ఆంధ్రాలో రాజధాని సరిగ్గా కట్టడం చేతకాకే ఇక్కడ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. ఒకసారి మాతో పెట్టుకుంటేనే తెలంగాణ తెచ్చుకున్నాం.. మళ్లీ మా జోలికొచ్చి 'టీఆర్ఎస్ 2.0'తో పెట్టుకుంటే మతి పళ్లు రాలతాయి." అని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఘాటుగా స్పందించారు.

# వర్షాభావ పరిస్థితులపై అవగాహన కల్పించాలి

- తక్కువ నీటి వినియోగం, పంట మార్పిడి, వైవిధ్యీకరణపై అన్నదాతలకు వివరించాలి
- దెబ్బతిన్న రోడ్లు, వంతెనల పునర్నిర్మాణానికి రూ.1,000 కోట్ల అత్యవసర నిధులు విడుదల
- వర్షాకాల సన్నద్ధతపై సెక్రటేరియట్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుదీర్ఘ సమీక్ష
- రామగుండం యూరియా మొత్తం మన రైతులకే ఇవ్వాలని కేంద్రానికి సీఎం లేఖ



**(మొదటి పేజీ తర్వాత.. )** సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. వాతావరణ మార్పుల దృష్ట్యా వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే రైతులు నష్టపోకుండా వ్యవసాయ శాఖ ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలపై క్షేత్రస్థాయిలో రైతులకు ముందస్తు అవగాహన కల్పించాలన్నారు. పంటల మార్పిడి, పంటల వైవిధ్యీకరణ వల్ల కలిగే ప్రయోజనాలను అన్నదాతలకు వివరించి, వారిని లాభసాటి వ్యవసాయం వైపు మళ్లించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా, రామగుండం ఫెర్టిలైజర్స్ ఫ్యాక్టరీలో (RFCL) ఉత్పత్తి అయ్యే యూరియా మొత్తం రాబోయే సీజన్‌లో తెలంగాణ రైతుల అవసరాల కోసమే పూర్తిగా కేటాయించేలా చూడాలని, ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి తక్షణమే లేఖ రాయనున్నట్లు సీఎం వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని సాగునీటి ప్రాజెక్టుల మెయింటెనెన్స్ (నిర్వహణ), గేట్ల మరమ్మతుల పనులపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. వర్షాలు ప్రారంభమయ్యే లోపే ఈ పనులన్నింటినీ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల మరమ్మతులకు అవసరమైన నిధులను తక్షణమే విడుదల చేయాలని ఆర్థిక శాఖను సూచించారు. గతంలో కురిసిన భారీ వర్షాలు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా దెబ్బతిన్న రోడ్లు, కూలిపోయిన వంతెనల పునర్నిర్మాణానికి అత్యవసర నిధులు మంజూరు చేయాలని సీఎం ఆదేశించారు. విపత్తు నిర్వహణ శాఖ వద్ద అందుబాటులో ఉన్న రూ. 1,000 కోట్ల నిధులను తక్షణమే నిబంధనల ప్రకారం విడుదల చేసి, పునరుద్ధరణ పనులు చేపట్టాలన్నారు. విపత్తుల సమయంలో ఎక్కడైనా ప్రాణనష్టం, ఆస్తి నష్టం, పశువుల నష్టం వంటి ఘటనలు చోటుచేసుకున్నప్పుడు అధికారులు ఏమాత్రం తాత్సార్యం చేయకుండా తక్షణమే స్పందించి నివారణ, సహాయక చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో అప్రమత్తంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

# బీజేపీలో చేరిన పండుగ రాజు

**సంగెం, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** సంగెం మండలంలోని తిమ్మాపురం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి గట్టి షాక్ తగిలింది. తిమ్మాపురం గ్రామ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి పండుగ రాజు సోమవారం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి భారతీయ జనతా పార్టీలో చేరారు. హనుమకొండలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పరకాల నియోజకవర్గ అసెంబ్లీ బరిలో నిలిచిన నాయకులు డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు ఆయనకు కాషాయ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

# తెలంగాణపై విషం చిమ్ముతున్న పవన్ కళ్యాణ్..

- ఇక్కడ నవనిర్మాణ సభ ఏంటి?
- రాష్ట్ర ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పిన తర్వాతే హైదరాబాద్‌లో సభ పెట్టాలి
- బీజేపీ ప్రోద్బలంతోనే పవన్ యాక్టింగ్..
- మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర ఆగ్రహం

**సిద్దిపేట/హుస్నాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో పవన్ కళ్యాణ్ 'తెలంగాణ నవనిర్మాణ సభ' నిర్వహించ తలపెట్టడాన్ని ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ రాజకీయ వైఖరిపై నిప్పులు చెరిగారు. తెలంగాణను బీజేపీకి తాకట్టు పెట్టడమే పవన్ చెప్పే నవనిర్మాణమా అని ఆయన నిలదీశారు. బీజేపీతో కుదుర్చుకున్న లోపాయికారీ ఒప్పందం మేరకే పవన్ కళ్యాణ్ ఇక్కడ మళ్లీ కొత్త నటన ప్రారంభించారని ఆరోపించారు. తెలంగాణ అస్తిత్వాన్ని, ఇక్కడి ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా గతంలో పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. "తెలంగాణ ప్రజల కళ్ల దిష్టి తగిలి కోనసీమలో కొబ్బరి చెట్లు ఎండిపోతున్నాయని ఆనాడు మాట్లాడిన పవన్ కళ్యాణ్, నేడు ఏ ముఖం పెట్టుకుని ఇక్కడికి వస్తున్నారు? తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు తాను తట్టుకోలేక 11 రోజుల పాటు అన్నం మానేశానని బహిరంగంగా చెప్పుకున్న వ్యక్తికి ఇక్కడ సభలు పెట్టే నైతిక హక్కు ఎక్కడిది?" అని మంత్రి ప్రశ్నించారు. అనువణువునా తెలంగాణపై వ్యతిరేకతను నింపుకున్న పవన్... ఇప్పుడు తెలంగాణ గడ్డపై విద్వేషాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందడానికి బీజేపీ ఎజెండాను భుజాన మోస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పవన్ కళ్యాణ్ పాల్గొంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, కానీ అదే రోజున ప్రత్యేకంగా రాజకీయ సభలు నిర్వహించడం వెనుక కుట్ర దాగి ఉందన్నారు. "ఈ నవనిర్మాణ సభను గుజరాత్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు లేదా కేరళలో కాకుండా హైదరాబాద్‌లోనే ఎందుకు నిర్వహిస్తున్నారు? కేవలం ఢిల్లీలోని బీజేపీ పెద్దలను మెప్పించడానికే ఈ డ్రామాలు ఆడుతున్నారు" అని నిలదీశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు పవన్ కళ్యాణ్‌ను నమ్మి భారీ మెజారిటీతో అధికార బాధ్యతలు అప్పగించారని, ఇక్కడ వేలు పెట్టే బదులు అక్కడ ఇచ్చిన హామీలపై, ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని మంత్రి సూచించారు. ఏపీకి జీవనాడి అయిన 'విశాఖ ఉక్కు కర్మాగారం' ప్రైవేటీకరణ వంటి కీలక అంశాలపై కేంద్రంతో పోరాడకుండా, తెలంగాణలో అనవసర రాజకీయాలు చేయడం సమంజసం కాదన్నారు.

# ఆన్‌లైన్ బెట్టింగ్ మాఫియా గుట్టురట్టు

- సీఐడీ చీఫ్ చారు సిన్హా నేతృత్వంలో 'భారీ ఆపరేషన్'
- 11 మంది నిర్వాహకులు అరెస్ట్
- కరీంనగర్ 'డాఫా బెట్' కేసు ఛేదించిన అధికారులు..
- 46 మ్యూల్ బ్యాంక్ ఖాతాలు సీజ్
- 8 రాష్ట్రాల్లో 225 ఫిర్యాదులు..
- రోజుకు 8 నుంచి 10 లక్షల అక్రమ సంపాదన
- బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసిన 25 మంది సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లుయెన్సర్లకు కౌన్సెలింగ్

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ రాష్ట్రంలో కలకలం రేపుతున్న ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ మాఫియాపై సీఐడీ విభాగాధిపతి (సీఐడీ చీఫ్) చారు సిన్హా నేతృత్వంలో ఐపీఎస్ అధికారుల బృందం భారీ ఆపరేషన్ నిర్వహించింది. దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్న ఒక పెద్ద అంతర్జాతీయ ఆన్‌లైన్ బెట్టింగ్ నెట్‌వర్క్ కార్యకలాపాలను అధికారులు విజయవంతంగా బట్టబయలు చేశారు. గత 15 రోజులుగా అత్యంత రహస్యంగా సాగిన ఈ ప్రత్యేక సీఐడీ ఆపరేషన్‌లో భాగంగా.. ఢిల్లీ, గుజరాత్, పంజాబ్ రాష్ట్రాల్లో దాడులు జరిపి మొత్తం 11 మంది ముఖ్య నిర్వాహకులను అరెస్టు చేశారు. ఈ కేసు పూర్తి వివరాలను సోమవారం సీఐడీ చీఫ్ చారు సిన్హా మీడియాకు వెల్లడించారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా 'సిట్' ఏర్పాటు చేసిందని, గతంలో నమోదై సీఐడీకి బదిలీ అయిన కేసులపై ముమ్మర విచారణ జరుపుతున్నామని ఆమె తెలిపారు. ఇందులో భాగంగానే కరీంనగర్‌లో నమోదైన ప్రసిద్ధ "డాఫా బెట్" కేసును పూర్తిగా ఛేదించినట్లు ప్రకటించారు.

### రోజుకు రూ. 8 నుంచి 10 లక్షల దోపిడీ..

ఈ ఆన్‌లైన్ దందా వెనుక ఉన్న నిర్వాహకులు నిరుద్యోగులు, అమాయకుల పేర్లతో తెరిచిన సుమారు 46 'మ్యూల్ బ్యాంక్ అకౌంట్స్'ను వినియోగిస్తున్నట్లు గుర్తించి, వాటిని తక్షణమే సీజ్ చేసినట్లు చారు సిన్హా చెప్పారు. ఈ ఖాతాల ద్వారా ఆర్గనైజర్లు రోజుకు ₹8 లక్షల నుండి ₹10 లక్షల వరకు అక్రమంగా సంపాదిస్తున్నారని విచారణలో తేలింది. సుమారు 40 మంది సీఐడీ అధికారులు రాత్రింబగళ్లు శ్రమించి ఈ అంతర్జాతీయ నెట్‌వర్క్‌ను పట్టుకున్నారని వివరించారు. కేవలం ఈ 'డాఫా బెట్' యాప్‌పైనే దేశంలోని 8 రాష్ట్రాల్లో 225 ఫిర్యాదులు, 73 క్రిమినల్ కేసులు నమోదు కావడం దీని తీవ్రతకు అద్దం పడుతోంది.

### 108 బెట్టింగ్ అప్లికేషన్ల బ్లాకింగ్‌కు ప్రతిపాదనలు..

తెలంగాణ వ్యాప్తంగా ఆన్‌లైన్ బెట్టింగ్ అప్లికేషన్లపై ఇప్పటివరకు 414 కేసులు నమోదు చేశామని సీఐడీ చీఫ్ వెల్లడించారు. సాంకేతిక నిపుణుల సాయంతో నిరంతరం నిఘా ఉంచి, సైబర్ లోకంలో చలామణి అవుతున్న 108 ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను గుర్తించామన్నారు. వాటిని పూర్తిగా దేశంలో నిషేధించేలాకేంద్ర ప్రభుత్వానికి తగిన ప్రతిపాదనలు పంపామన్నారు. ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్ల సమన్వయంతో ప్రస్తుతం 37 అప్లికేషన్లు కేవలం తెలంగాణ భౌగోళిక పరిధిలోనే అందుబాటులో ఉండేలా 'జియో ఫెన్సింగ్' సాంకేతికతను ఏర్పాటు చేశామని చెప్పారు. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ మరియు ఇతర సోషల్ మీడియా వేదికల్లో ఈ ప్రమాదకరమైన బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తూ, యువతను తప్పుదోవ పట్టిస్తున్న 25 మంది ప్రముఖ సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను గుర్తించి వారికి సీఐడీ కార్యాలయంలో కౌన్సెలింగ్ ఇచ్చినట్లు చారు సిన్హా స్పష్టం చేశారు.

> "ఆన్‌లైన్ బెట్టింగ్‌ను ప్రమోట్ చేసిన సెలబ్రిటీలకు, ఇన్‌ఫ్లుయెన్సర్లకు చట్టపరంగా ఇదొక్కటే 'చివరి అవకాశం' (ఒక్క ఛాన్స్) ఇస్తున్నాం. వారికి పూర్తిస్థాయిలో కౌన్సెలింగ్ ఇచ్చి హెచ్చరించడం జరిగింది. ఇకపై ఎవరైనా మళ్లీ బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసినా లేదా వాటి ప్రకటనల్లో నటించినా ఎంతటి వారినైనా వదిలిపెట్టేది లేదు.. వారిపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేస్తాం."
>
> - చారు సిన్హా, సీఐడీ చీఫ్, తెలంగాణ

వాయిస్ ఆఫ్ వందే భారత్ Voice of Vande Bharath

VOICE OF VANDE BHARATH

సోమవారం, జూన్ 01, 2026

# ఓటు హక్కు వజ్రాయుధం వంటిది

• డాక్టర్ గువ్వల బాలరాజు

**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రజాస్వామ్యానికి ఓటు హక్కే అసలైన పునాది అని, అది ప్రతి పౌరుడి చేతిలో ఒక వజ్రాయుధం వంటిదని అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ గువ్వల బాలరాజు అన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలో 100 శాతం పారదర్శకమైన ఓటరు జాబితా తయారీయే లక్ష్యంగా ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని బీకే ప్యాలెస్ లో నిర్వహించిన 'సర్' నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా గువ్వల బాలరాజు మాట్లాడుతూ.. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జూన్ 25 నుండి జూలై 24 వరకు బూత్ లెవెల్ అధికారులు నిర్వహించే ఇంటింటి సర్వేలో బీజేపీ బూత్ లెవెల్ ఏజెంట్లు అత్యంత క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు. నియోజకవర్గంలో ఒక్క దొంగ ఓటు లేదా బోగస్ ఓటు కూడా లేకుండా జాబితాను ప్రక్షాళన చేయాలని ఆయన కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. 2026 అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి యువతీ, యువకుడిని గుర్తించి, వారి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చూడాలి. మరణించిన వారి పేర్లు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా



వలస వెళ్లిన వారి పేర్లను ఓటరు జాబితా నుండి తొలగించాలి. అలాగే ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటు ఉంటే వాటిని గుర్తించి సరిదిద్దాలి. 'మన బూత్ – మన బాధ్యత' అనే నినాదంతో బీజేపీ మండల అధ్యక్షులు ప్రతిరోజూ బూత్ స్థాయి పనులను పర్యవేక్షిస్తూ, సమీక్షలు నిర్వహించాలి. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు వేముల నరేందర్ రావు, తెలంగాణ కన్వీనర్ సాల్కార్ రెడ్డి, మాజీ మంత్రి పోతుగంటి రాములు, రాష్ట్ర అధికార ప్రతినిధి సోలంకి శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. వీరితో పాటు పట్టణ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, వివిధ మండలాల అధ్యక్షులు, బూత్ కమిటీ బాధ్యులు, భారీ సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ చీరల పంపిణీ



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** పట్టణ పరిధిలోని 9వ వార్డు మధుర నగర్ కాలనీలో మహిళా సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ తాలూకా అధ్యక్షులు చింతల రాజ్ గోపాల్ ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలకు చీరలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, అందులో భాగంగానే ఇందిరమ్మ చీరల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. నిరుపేద మహిళలందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాములు నాయక్, సెవ్వ శ్రీశైలం, రాములు సేట్, వార్డు మహిళలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువులు



**ఉప్పునుంతల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మండలంలోని రైతులకు వ్యవసాయ శాఖ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రాయితీపై పచ్చిరొట్ట ఎరువులను పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి కోర్ర రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. భూసారాన్ని పెంచేందుకు ఉపయోగపడే పచ్చిరొట్ట ఎరువులను ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో రైతులకు అందుబాటులో ఉంచిందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఉప్పునుంతల మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో 180 బ్యాగుల పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఒక్కో బ్యాగు బరువు 30 కేజీలు ఉంటుందని వివరించారు. పూర్తి ధర రూ.4,905 కాగా, రైతు చెల్లించవలసిన రాయితీ ధర రూ.2,453 మాత్రమేనని పేర్కొన్నారు. ఈ సబ్సిడీ ఎరువులను పొందాలనుకునే రైతులు తమ వెంట ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకము, యాక్టివ్‌లో ఉన్న ఫోన్ నెంబర్ తెచ్చుకోవాలని సూచించారు. మండలంలోని రైతు సోదరులందరూ ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సకాలంలో పత్రాలను సమర్పించి రాయితీపై ఎరువులను పొందాలని వ్యవసాయ అధికారి రమేష్ కోరారు.

# వేములవాడ విద్యార్థుల ఘనత

▪ 10 మందికి కరాటే బ్లాక్ బెల్ట్

**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** వేములవాడకు చెందిన కరాటే విద్యార్థులు ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో నిర్వహించిన కరాటే గ్రేడింగ్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి సత్తా చాటారు. శనివారం సాయంత్రం కరీంనగర్ పట్టణంలోని వివేకానంద స్కూల్‌లో 'ఓకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ' ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా కరాటే బ్లాక్ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. వేములవాడ ఓకినావా స్పోర్ట్స్ కరాటే అకాడమీ మాస్టర్ అబ్దుల్ మన్నన్ పర్యవేక్షణలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు ఈ పరీక్షల్లో పాల్గొని అద్భుత ప్రదర్శన చేసినట్లు అకాడమీ చీఫ్ ఎగ్జామినర్ కె.వసంత్ కుమార్ తెలిపారు. వీరిలో 10 మంది విద్యార్థులు ప్రతిష్టాత్మక 'బ్లాక్ బెల్ట్' సాధించగా, మరో ముగ్గురు విద్యార్థులు 'బ్రౌన్ బెల్ట్' కైవసం చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా బ్లాక్ బెల్ట్, బ్రౌన్ బెల్ట్ సాధించిన వేములవాడ విద్యార్థులు కరీంనగర్ పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. విద్యార్థుల ప్రతిభను శ్లాఘించిన



సీపీ, వారికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. మార్షల్ ఆర్ట్స్ కేవలం ఆత్మరక్షణకే కాకుండా, విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఏకాగ్రతను పెంపొందించడానికి ఎంతో తోడ్పడతాయని ఆయన కొనియాడారు. బ్లాక్ బెల్ట్ గ్రహీతలు మహమ్మద్ అబ్దుల్ ఫర్హాన్ అబ్బాసి, పి. భాస్కర్, కె. సాయి మణిరూప్, కె. సాయి మణి హర్షిత్, ఎస్.కె. షరీన్, ఎస్.కె. తన్జీజ్, సి.హెచ్. సూర్య సుశీల్, వి.శివహిత్, వి. షిరిహాస్, జి. వివేకా శ్రీ కాగా, బ్రౌన్ బెల్ట్ గ్రహీతలు పి. జానవి, పి. వర్షిత్ కుమార్, సిద్దులు కాగా ఉన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే శిక్షకులు పుల్లూరి శ్రీనివాస్, మరిపల్లి శ్రీనివాస్, కనికరపు రాజశేఖర్, కె.రాజశేఖర్ పాల్గొన్నారు.

# జీతాల్లో కోతలు విధించడం సమంజసం కాదు

తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆగ్రహం

**నాగర్‌కర్నూల్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** హెల్త్ కార్డులకు సంబంధించిన స్పష్టమైన విధివిధానాలను ప్రకటించకుండా, ఉపాధ్యాయ సంఘాలతో కనీసం చర్చించకుండా జీతాల నుంచి ప్రీమియం వసూలు చేయడం ఎంతమాత్రం సరికాదని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు దెండి రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి మనెమోని శేఖర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారికంగా హెల్త్ కార్డులు జారీ చేయకుండా, పథకంపై డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ ఆఫీసర్లకు, ఉద్యోగులకు ఎలాంటి పూర్తి సమాచారం ఇవ్వకుండానే.. మే నెల జీతంలోని బేసిక్ పే నుంచి 1.5 శాతం కోత విధించడం ఉపాధ్యాయులను మోసగించడమేనని వారు ఆరోపించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల ప్రయోజనాల దృష్ట్యా సంఘం తరపున ప్రభుత్వానికి పలు ప్రధాన డిమాండ్లను సమర్పించారు. ఉద్యోగుల ముందస్తు అనుమతి తీసుకోకుండా వసూలు చేసిన ప్రీమియం మొత్తాన్ని వెంటనే తిరిగి చెల్లించాలి. మొదట హెల్త్ కార్డులు జారీ చేసి, పూర్తి విధివిధానాలు స్పష్టం చేసిన తర్వాతే కోతలు చేపట్టాలి. ఈ హెల్త్ కార్డు పథకం ఇష్టం లేని ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు దీని నుండి మినహాయింపు పొందే అవకాశం కల్పించాలి. భార్యాభర్తలిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులైన పక్షంలో.. ఇద్దరి నుంచి కాకుండా, ఎవరో ఒకరి జీతం నుండి మాత్రమే ప్రీమియం వసూలు చేయాలి. యువతీ యువకులకు సైతం ఈ పథకం వర్తించేలా, ఉద్యోగులపై ఆధారపడిన వారి వయోపరిమితిని ప్రస్తుతమున్న 25 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాలకు పెంచాలి. సీనియర్, జూనియర్ అనే తేడాలు చూపకుండా ఉద్యోగులందరికీ ఒకే రకమైన ప్రీమియం విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోంది.

# వేములవాడ పట్టణాభివృద్ధే లక్ష్యం

▪ సమగ్ర ప్రణాళికలతో ముందుకు సాగుతున్నాం

▪ రోడ్డు వెడల్పు పనులను పరిశీలించిన విప్ ఆది శ్రీనివాస్

**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** వేములవాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్లడమే ప్రజా ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం వేములవాడ పట్టణంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయం ముందు జరుగుతున్న రోడ్డు వెడల్పు పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాజన్న ఆలయ అభివృద్ధితో పాటు వేములవాడ పట్టణ ప్రగతికి కూడా సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇంచార్జ్ మంత్రులు, దేవాదాయ శాఖ మంత్రుల సహకారంతో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. ఆలయ పరిసరాల్లో సుమారు రూ.150 కోట్లతో వివిధ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని, ఇందులో భాగంగానే ఆలయం ముందు నుంచి బ్రిడ్జి వరకు 80 ఫీట్ల రోడ్డు విస్తరణ పనులు చేపట్టామని వెల్లడించారు. నిర్వాసితులు, దుకాణదారులు, పట్టణ పెద్దలు, ప్రజాప్రతినిధుల సహకారంతో ఈ పనులు సజావుగా ముందుకు సాగుతున్నాయని ఆయన తెలిపారు. సుమారు రూ.6.50 కోట్ల అంచనా వ్యయంతో 80 ఫీట్ల రోడ్డు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. త్వరితగతిన తారు రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించడమైనది. పట్టణ అందాలను పెంపొందించేందుకు రూ.2.60 కోట్లు కేటాయించాము. సెంట్రల్



లైటింగ్ సిస్టం పనులు వేగంగా సాగుతున్నాయి. వనమహోత్సవం సందర్భంగా భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతి కలిగేలా ప్రత్యేక మొక్కలు నాటాలని నిర్ణయించాము. రూ.35 కోట్లతో అన్నదాన సత్రం పనులు కొనసాగుతున్నాయి. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ₹6 కోట్లతో భీమేశ్వర ఆలయాన్ని ఆధునీకరించాము.బద్ది పోచమ్మ ఆలయం వద్ద పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అక్కడి నిర్వాసితులకు పునరావాసంలో భాగంగా సెటర్ల ఏర్పాటు పనులు త్వరలోనే పూర్తవుతాయి. వేములవాడను అటు ఆధ్యాత్మికంగా, ఇటు మౌలిక వసతుల పరంగా రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని విప్ పునరుద్ఘాటించారు. ఈ పనుల పరిశీలన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, మాజీ పట్టణ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు కొండా శేఖర్, అన్నారపు శ్రీనివాస్, కొక్కుల బాలకృష్ణ, తోటరాజు, అలాగే ప్రముఖ నాయకులు కూరగాయల కొమురయ్య, సాగరం వెంకటస్వామి, సిరిగిరి శ్రీకాంత్, నాగరాజు, తోట లహరి, పులి రాంబాబు, అనిల్, నాగుల విష్ణు తదితరులు పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
సోమవారం, జూన్ 01, 2026

# ప్రజల సంక్షేమమే ధ్యేయం

• అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ

**వంగూర్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మండలంలోని చింతపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన పలు ప్రగతి కార్యక్రమాల్లో అచ్చంపేట శాసనసభ్యులు, టీపీసీసీ ఉపాధ్యక్షులు, డీసీసీ అధ్యక్షులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇందులో భాగంగా గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల సముదాయాన్ని మరియు గ్రామానికి కల్పించిన 24 గంటల నిరంతర విద్యుత్ సౌకర్యాన్ని ఆయన చేతుల మీదుగా కొబ్బరికాయ కొట్టి అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ.. పేద, నడిమంత్రపు వర్గాల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ప్రజాప్రతినిధులకు, ప్రజలకు వివరించారు. అర్హులైన ప్రతి పేదవానికి సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేస్తున్నామని, అలాగే గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయానికి, గృహాలకు



నాణ్యమైన 24 గంటల విద్యుత్‌ను అందిస్తున్నామని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను మౌలిక వసతులతో ప్రగతి పథంలో నడిపిస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రగతి ఉత్సవ కార్యక్రమంలో వంగూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిమ్ముల రాజశేఖర్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల మండల, జిల్లా, గ్రామ స్థాయి నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాల్లో పాల్గొన్న సర్పంచులు



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** స్థానిక అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆదేశాల మేరకు పదర మండలం గానుగుపెంట గ్రామ పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాల కార్యక్రమం సోమవారం పండుగ వాతావరణంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాల్లో గానుగుపెంట సర్పంచ్ వాంక్డావత్ కమల స్వామి, ఇప్పలపల్లి సర్పంచ్ గామ నాయక్ ముఖ్య అతిథులుగా పాల్గొని లబ్ధిదారుల చేత గృహప్రవేశాలు చేయించారు. ఈ సందర్భంగా గానుగుపెంట సర్పంచ్ కమల స్వామి మాట్లాడుతూ.. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ ఇండ్లు' నిరుపేదల ఆత్మగౌరవ ప్రతీక అని కొనియాడారు. గత ప్రభుత్వం పదేళ్లపాటు అధికారంలో ఉన్నా ఏనాడూ పేదల సొంతింటి కల గురించి ఆలోచించలేదని విమర్శించారు. నిరుపేదలకు పక్కా గృహాన్ని అందించాలనే ఉదాత్తమైన ఆశయంతో ఈ పథకాన్ని తీసుకొచ్చిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణకు ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రామంలో నూతనంగా మంజూరై, నిర్మాణంలో ఉన్న మిగిలిన ఇందిరమ్మ ఇండ్లను కూడా లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు. త్వరలోనే ప్రారంభం కానున్న రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల పథకంలో గ్రామంలోని అర్హులైన పేదలందరికీ ఇండ్లు మంజూరయ్యేలా ఎమ్మెల్యే సహకారంతో పూర్తి బాధ్యత తీసుకుంటామని సర్పంచ్ భరోసా ఇచ్చారు. ఈ గృహప్రవేశాల ఉత్సవంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ సర్పంచులు, గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, అధికారులు, గ్రామ యువకులు, మహిళలు పాల్గొన్నారు.

# ప్రజా పాలనలో నిరుపేదల సొంతింటి కల సాకారం

**వెల్టూర్ (ఉప్పునుంతల), వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వ పాలనలో నిరుపేదల సొంతింటి కల నెరవేరుతోందని ఉప్పునుంతల మండల పరిధిలోని వెల్టూర్ గ్రామ సర్పంచ్ చింతోజ్ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి ఉమాశంకర్ అన్నారు. ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకమైన 'ఇందిరమ్మ ఇండ్ల'లో భాగంగా వెల్టూర్ గ్రామానికి మంజూరైన లబ్ధిదారురాలు జల్లెల లక్ష్మమ్మ నూతన ఇందిరమ్మ ఇల్లును సోమవారం వారు ప్రత్యేకంగా ప్రారంభించారు. లబ్ధిదారురాలితోనే రిబ్బన్ కత్తిరింపజేసి గృహప్రవేశ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్, కార్యదర్శిలు మాట్లాడుతూ.. నిరుపేదలకు పక్కా గృహాన్ని అందించి ఆత్మగౌరవంతో బతికేలా చేసిన ఘనత ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, స్థానిక అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణలకే దక్కుతుందని కొనియాడారు. గ్రామంలోని అర్హులైన ప్రతి పేదవానికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా ప్రజాప్రతినిధులు నిరంతరం కృషి చేయాలని, అందుకు అధికారులు సైతం పూర్తి సహకారం అందించాలని కోరారు. అనంతరం వారు లబ్ధిదారురాలితో



కలిసి నూతన గృహాన్ని పరిశీలించి, స్వీట్లు తినిపించి లక్ష్మమ్మ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ గృహప్రవేశ ఉత్సవ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఉప్పరి మల్లేష్, వార్డు సభ్యులు పుట్ట మల్లయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ దేవేందర్, స్థానిక నాయకులు గుద్దటి బాలరాజు, నిరంజన్, బ్రహ్మచారి, అలాగే గ్రామ పంచాయతీ కార్మికులు లక్ష్మమ్మ, లాలూగౌడ్, నిరంజన్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఒక నిరుపేద కుటుంబాన్ని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తుమ్మల శ్రీనివాస్ రెడ్డి మానవత్వంతో ఆదుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. అచ్చంపేట మండలంలోని పులిజాల గ్రామానికి చెందిన కుందేటి భాస్కర్ (తండ్రి నిరంజన్) గత కొన్ని రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన వైద్యం కోసం ఆయనను కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా, వైద్యులు పరీక్షించి అత్యవసరంగా సర్జరీ చేశారు. అయితే, ఆసుపత్రి ఖర్చులకు సరిపడా డబ్బులు లేక, ఉన్నతాధికారులను ఆశ్రయించలేక ఆ కుటుంబం తీవ్ర ఇబ్బందులు పడుతోంది. ఈ విషయాన్ని గమనించిన పులిజాల గ్రామస్థులు.. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తుమ్మల శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన శ్రీనివాస్ రెడ్డి వెంటనే హైదరాబాద్‌లోని సదరు ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న భాస్కర్‌ను పరామర్శించారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలని అక్కడి వైద్యులతో మాట్లాడారు. అనంతరం ఆ కుటుంబానికి అండగా నిలుస్తూ తన వంతు సహాయంగా రూ.20,000 నగదును తక్షణ ఆర్థిక సహాయం కింద అందజేశారు. ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాన్ని సకాలంలో స్పందించి ఆదుకున్నందుకు పులిజాల గ్రామస్థులు, బాధితుడి కుటుంబ సభ్యులు శ్రీనివాస్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మంచి మనసుతో ఆయన చేస్తున్న ఇటువంటి సామాజిక సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని కొనసాగాలని గ్రామస్థులు ఆకాంక్షించారు.

# పద్మశాలి సంఘాల బలోపేతమే లక్ష్యం

◆ టీపీపీఎస్ జిల్లా అధ్యక్షులు చిలుకమారి వెంకటేశ్వర్లు
◆ ఏకగ్రీవంగా కురవి మండల కమిటీ ఎన్నిక

**మహబూబాబాద్, వాయిస్ ఆఫ్ వందేభారత్ :** మహబూబాబాద్ జిల్లా అఖిల భారత పద్మశాలి సంఘం అనుబంధ తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం (టీపీపీఎస్) జిల్లా అధ్యక్షులు చిలుకమారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కురవి మండల కేంద్రంలో పద్మశాలి సంఘం సన్నాహక సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పద్మశాలి కుల బాంధవులను ఏకం చేసేందుకు, సంఘం బలోపేతం కొరకు మండల కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు తెలిపారు. ఈ సమావేశంలో కురవి మండల నూతన పద్మశాలి కమిటీని ఏకాభిప్రాయంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కురవి మండల నూతన కార్యవర్గంలో మండల అధ్యక్షుడిగా దేవరశెట్టి మల్సూర్, ప్రధాన కార్యదర్శిగా చిన్నం భాస్కర్, కోశాధికారిగా మాద మల్లయ్య ఎన్నికయ్యారు. జిల్లాలో పద్మశాలి సంఘాల బలోపేతానికి జిల్లా కమిటీ సభ్యులతో కలిసి విస్తృతంగా పర్యటిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు చిలుకమారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఇదే ఉత్సాహంతో గార్ల, డోర్నకల్ మండలాల కుల సంఘ బంధువులు కూడా త్వరలోనే తమ నూతన మండల కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. మండలాల పర్యటనలో భాగంగా జిల్లా అధ్యక్షులు, కమిటీ సభ్యులు కురవి వీరభద్రస్వామి ఆలయంతో పాటు గార్ల వేట వెంకటేశ్వరస్వామి దేవాలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పద్మశాలి కుల బాంధవుల ఇళ్లల్లో పంటలు బాగా పండాలని, అందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని స్వామివార్లను ప్రార్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పాటవుతున్న మండల కమిటీల వారు పద్మశాలి కమ్యూనిటీ భవనాల నిర్మాణం కోసం స్థల సేకరణ చేయాలని కోరారు. స్థలం సేకరించిన తర్వాత భవన నిర్మాణ నిధుల కొరకు ప్రభుత్, ప్రజాప్రతినిధుల నుంచి నిధులు మంజూరయ్యేలా తన వంతుగా పూర్తి



బాధ్యత తీసుకుని కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ మార్కండేయ దేవాలయ చైర్మన్ కైరంకొండ వీరన్న, టీపీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సామల నర్సయ్య, ఉపాధ్యక్షులు మామిడాల శ్రీనివాస్, పోపా అధ్యక్షులు యోగేశ్వర్, ఆదినారాయణ, యువజన సంఘం అధ్యక్షులు సిద్ధార్థ, మెతుకు



భాస్కర్, వినోద్,టీపీపీఎస్ రాష్ట్ర కమిటీ మెంబర్ చిలుక నరసయ్య, కురవి మండలానికి చెందిన ప్రముఖ నాయకులు మాడం శ్రీను, భారీ సంఖ్యలో పద్మశాలి కుల బాంధవులు పాల్గొన్నారు.

## అల్వాల రామకృష్ణకు పరామర్శ..

తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం (టీపీపీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు చిలుకమారి వెంకటేశ్వర్లు ఆదివారం జిల్లా కమిటీ సభ్యులతో కలిసి పద్మశాలి సంఘం జిల్లా మాజీ కార్యదర్శి అల్వాల రామకృష్ణను పరామర్శించారు. వారి నివాసానికి వెళ్లిన టీపీపీఎస్ నూతన కార్యవర్గ బృందం.. అల్వాల రామకృష్ణ కుశలప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు.